# రససిద్ధి

## విశ్వనాథపావనిశాస్త్రి

**కపిలాచార్యుడు ఆనందవర్ధనుడి ఆస్థాన కవి. మహా పండితుడు. ఎంత మహా పండితుడో అంత మహావక్త. పరమ నిర్భీకుడు. ఆయన సాహిత్యం నిండా బ్రాహ్మణ మతస్థాపనే! చాతుర్వర్ణ్య ప్రసక్తే! మహారాజైన ఆనందవర్ధనుడు, యువరాజైన విష్ణువర్ధనుడు ఇద్దరూ బౌద్ధమతస్థులు.**

వాళ్ళకి కపిలాచార్యుని ఈ వీర హైందవం నచ్చేది కాదు. కాని ఆయనతో వాదించి గెలవడం అసంభవం. అదీగాక ఆయన గొప్ప శీలవంతుడు, మహానీతిమంతుడు, నిత్యసత్యవాక్కు. అన్నిటినీ మించి మహాధానుష్కుడు. ఆనాడు మొత్తంమీద ఆయనను మించిన ధానుష్కుడు లేడు.

ఆయన తన సర్వసాహిత్యం రాజాంకితం కాక శివాంకితంగానే వ్రాశాడు. మహారాజు ఎప్పుడూ శ్రోత మాత్రమే.

ప్రతి కవీ, తన కవిత్వం కపిలాచార్యుడికి వినిపించి ఆయన మెప్పు పొందాలని, ఆయన తనను గొప్పవాడని అనాలని అనుకునేవాడు. ఆయన కివ్వన్నీ నీరసంగా వుండేవి. హిమాలయం ముందు చిన్న చిన్న గుట్టలు రొమ్ము విరుచుకుని నిలబడితే హిమాలయం ఏం చేస్తుంది? ఆయనా అదే చేసేవాడు. మహారాజైనా, మహాసభైనా- తన అభిప్రాయం నిక్కచ్చిగా నిర్మొహమాటంగా చెప్పేసేవాడు. ఇది చాలా మందికి బాధ కలిగించేది. దాంతో కొందరాయనను గురించి దురహంకారి అనీ, మూఢాచార పరాయణుడనీ, తిరోగామి అనీ, అస్పృశ్యతాభావ దూషితుడనీ, పరమత సహనం లేని వాడనీ- యిలా ఏవేవో దుష్ప్రచారాలు చేసేవారు. ఆయన కెంతసేపూ తనూ, తన కవిత్వమే తప్ప యితరుల కవిత్వం మెచ్చుకోవడం చేత కాదనే ఒక సూత్రం అనన్య ప్రచారం పొందింది. ఆయన మాత్రం యివేమీ పట్టించుకోకుండా అల్లాగే సహస్రచంద్రోదయాలు చూశాడు.

ఒకనాడు ఆయన అరుగు మీద కూర్చుని ఉండగా, ఎవరో ఒక వ్యక్తి- చింపిరి జుట్టు, చినిగిన గుడ్డలు, నల్లగా అందవిహీనంగా వున్న విగ్రహం- వచ్చి నమస్కరించాడు. అతనొక అంటరానివాడు. "ఏం కావాలి" అని అడిగాడు కపిలాచార్యుడు. అతను, "స్వామీ! నా పేరు బసవడు. నేనొక కావ్యం వ్రాశాను తమరికి వినిపిద్దామని వచ్చాను." అన్నాడు.

కపిలాచార్యుడికి చాలా కోపం వచ్చింది. "ప్రతి వాడూ కావ్యం వ్రాసేవాడే. ఛస్తున్నాను దౌర్భాగ్యులతో. కేశలేశం తెలీదెవడికీ మళ్ళీ. పైగా ఆ చెత్తంతా నేను వినాలిట. చచ్చినట్టు వీళ్ళ అమ్మ మొగుడి సొమ్ము నాదగ్గర దాచిపెట్టారు. నేను వినను వెళ్ళు" అని తిట్టి పంపేశాడు.

మర్నాడు బసవడు మళ్ళీ వచ్చాడు. "స్వామీ! మీరు నాకావ్యం వింటే చాలు నాకు. సృష్టిలో యింకేమీ అక్కరలేదు. మీపాదాల మీద పడతా!" అన్నాడు. కపిలాచార్యుడు మళ్ళీ కేకలేసి పంపేశాడు.

అలా అనేక రోజులు, రోజూ వచ్చి అడిగేవాడు బసవడు. కపిలాచార్యుడు, "ఏమిరా! నేను వినను అంటుంటే నీ కవగతం కావడం లేదా? ఎందుకు నన్నిలా విసిగిస్తావు?" అన్నాడు చివరికి

బసవడు కపిలాచార్యుడి కేసి నిశ్చలంగా చూస్తూ, "స్వామీ! కాసిని ఎండుపుల్లలు యిప్పిస్తారా!" అని అడిగాడు. ఆశ్చర్యపోయాడు కపిలాచార్యుడు. "కోప్పడకండి స్వామీ! మన్నించండి. మీరు వినకపోయిన తరువాత నా కావ్యం ఎందుకు కాల్చనా? మీ ముందే తగలబెట్టేస్తాను. దయుంచి కాసిని ఎండుపుల్లలు ఇప్పించండి" అన్నాడు బసవడు

కపిలాచార్యుడు స్థాణువైపోయాడు. ఆలోచించాడు. అది ఎటువంటి కావ్యమైనా, తను వినకపోవడం కారణంగా అది అగ్న్యర్పణం అవుతుంది అనేది సహించలేకపోయాడు. చివరికి శాంతంగా, "సరే! ఆ గ్రంధం అక్కడ వుంచి రేపురా! చదివి రేపిస్తాను. నువు వినిపిస్తే, వింటూ కూర్చునే ఓపిక లేదిప్పుడు నాకు. రాత్రికి చదువుతాను." అన్నాడు. బసవడు ఆ గ్రంధం కపిలాచార్యుడి పాదాల దగ్గర పెట్టి ఆనందంగా వెళ్ళిపోయాడు.

* * *

మర్నాడు ఉదయం బసవడొచ్చాడు. కపిలాచార్యుడు, ఆయన కొడుకు పతంజలి శాస్త్రి కూర్చుని ఏదో చర్చిస్తున్నారు. కపిలాచార్యుని కళ్ళు ఎర్రగా జ్యోతుల్లాగే ఉన్నాయి. ఆయన కడచిన రాత్రి నిద్రపోయినట్టు లేదు. ఆయన కళ్ళల్లో శారదాదేవి చంద్రమౌళీశ్వరుడితో కలిసి తాండవం చేస్తోంది.

పతంజలి బసవడిని కూర్చోమన్నాడు. ఎన్నోసార్లు బలవంత పెట్టగా, చివరికి కూర్చుంటే గాని వీల్లేదని తెలిసి, నేలమీద కూర్చున్నాడు బసవడు.

పతంజలి, "ఏమయ్యా! కావ్యం అన్నాక ఎవరికో ఒకరికి అంకితం యివ్వాలి కదా!

మరి దీన్ని ఎవరికి అంకితం యిద్దామను కుంటున్నావు?" అని అడిగారు. బసవడు. "మానవ మాత్రుడెవరికీ అంకితం యిద్దా మనుకోలేదు స్వామీ!" అన్నాడు. కపిలా చార్యుడు పతంజలికేసి చూశాడు. ఆయన కనుకొలుకుల్లో నీళ్ళు నిండి ఉన్నాయి. పతంజలి చిరు నవ్వు నవ్వుతూ, "అదేమి టయ్యా! నువ్వింకా అంకితం యిస్తా వేమో పుచ్చుకుందా మనుకుంటున్నారే నాన్నగారు!" అన్నాడు.

బసవడు ఆనంద బసవడు అయ్యాడు. "ఆయన మానవ మాత్రుడని నేనను కుంటే కదా బాబు! అంత అదృష్టమూ నాకు? అంత అదృష్టమూ?" అంటూ సాష్టాంగ పడిపోయి. అప్పటికప్పుడు అంకితం పద్యాలు చెప్పాడు ఆశువుగా. అవి రస గుళికలు.

• • • • •

కిట కిట లాడి పోతోంది. మహా సభ అంటరాని వాడైన బసవడిని సభా వేదిక మీద కౌగలించుకుని. పండిత శాలువకప్పి సువర్ణంతో సత్కరించాడు వీర హైంద వుడు. పరమఛాందసుడు అయిన కపిలా చార్యుడు. ఆయన శత్రులోకం మహాంధ మైపోయింది. ప్రజలు ఆశ్చర్యపోయారు. మహారాజు, యువరాజులు. దిగ్భ్రాంతులై పోయారు. నిలువెల్లా వణికి పోతున్న బసవడిని పడిపోకుండా పట్టుకుని నిలబ డాల్సి వచ్చింది పతంజలికి.

వృద్ధుడై సరిగా నిలబడ లేకుండా వున్న కపిలాచార్యుడు కంఠం విప్పాడు. సూచీ నిశ్శబ్ధంగా వున్న మహా సభలో వరుణ రథం పరిగెత్తినట్టుంది— "నేను నా జీవితం అంతా రసాధి దేవత నుపా సించాను. కాని ఆమె బసవడికి ప్రసన్న మైంది. 'నేను కేవలం రసవాదిని. బసవడు రసలోకవిహారి నేను మహారాజుల ఆస్థాన కవిని! అతడు నా ఆస్థాన కవి."

సభ సభంతా, శిల్పి చెక్కని శిల్పం అయిపోయింది కంపించుపోతున్న బసవడు కంటికీ, మంటికీ ఏకధారగా తల్లడిల్లిపోతూ కపిలాచార్యుడికి సాష్టాంగ పడిపోయాడు.

అతని పెదవులేవో చెపుతున్నాయి. కంఠదఘ్నమైన అతని ఆనందమే కనబడు తోంది తప్ప, అతని స్వరం ఎవరికీ విని పించడం లేదు. అతని మనో భావం అందరికీ సువిస్పష్టంగా గోచరిస్తోంది— "నా స్వామి నాకోసం యిలా అవతార విశేషంగా దిగివచ్చిన రసస్వరూపుడు".

